విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

గురువారం 20, మార్చి 2025 8 పేజీలు

ప్రశాంతంగా పది పరీక్షలు

26413 మంది విద్యార్థులు హాజరు

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్: జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, బుధవారం హిందీ పరీక్ష జరిగాయని, పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 26402 మంది విద్యార్థులు హాజరయ్యారని డిఇఒ కెవియన్. కుమార్ ఒక ప్రక టనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 164 పరీక్ష కేంద్రాలలో ఉద యం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరిగినది. ఈ పరీక్షకు రెగ్యులర్ 26660 మంది, ప్రవేటు 25 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా రెగ్యులర్ 26402, ప్రవేటు 11 మంది మొత్తం 26413 హాజరయ్యారని, రెగ్యులర్ 258 మంది. ప్రవేటు 14మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. అదేవి ధంగా 10వ తరగతి ఓపెన్ స్కూల్స్ పరీక్షకు సంబంధించి 957 మందికి 840 మంది విద్యార్థులు హాజరుకాగా 116 మంది గైర్హాజ రజారయ్యారని. పరీక్ష కేంద్రాలలో త్రాగునీటి వసతి, పోలీసు బం దోబస్తు, మెడికల్ క్యాంపు, సీసీ కెమరాల ఏర్పాటులతో పర్యవేక్షణ, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా బస్సు సౌకర్యం కల్పించడం జరిగినదని, ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసులు, అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించబడినట్లు డిఇఒ ఆ ప్రకటనలో తెలిపారు.

పది పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఇన్‌ఛార్జ్ కలెక్టర్, ఎస్పీలు

విశాలాంధ్ర – చిత్తూరు: జిల్లా వ్యాప్తంగా ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. పాఠశాలలో పరీక్షలు జరుగుతున్న అన్ని తరగతి గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వేసవి నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద విధిగా తాగునీటి వసతి, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మాస్ కాపీయింగ్ కు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అర్థగంట ముందే చేరుకోవాలని హడావిడి లేకుండా ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని విద్యార్థులకు జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలోని మున్సిపల్ హై స్కూల్, న్యాయార్క్ స్కూల్ లను జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ పరిశీలించారు. ఈ కేంద్రాల వద్ద బందోబస్తు తీరును పరిశీలించి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశామని,విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎస్పి తెలిపారు.

క్రీడల వల్లే ఒత్తిడి తగ్గుతుంది

- క్రికెట్‌తో పాటు వాలీబాల్ పోటీలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్: ప్రతి ఒక్కరు ఆటల పోటీలలో పాల్గొనడం వల్ల ఓత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటారని క్రీడలు విద్యార్థుల ఒత్తిడిని తగ్గిస్థాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎస్వి తారకరామ స్టేడియం నందు ఈ నెల 8 నుండి నిర్వహిస్తున్న మెగా కార్పొరేట్ క్రికెట్ టి20 లీగ్ 2025 విజేతలకు బహుమతులు పంపిణీలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆటల పోటీలలో పాల్గొనడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. ఈనెల 8 నుండి 10 రోజుల పాటు మంచి వాతావరణంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం, అందులో 10 జట్లు పాల్గొనడం జరిగిందన్నారు. క్రికెట్ తో పాటుగా వాలీబాల్ వంటి టోర్నమెంటులు జిల్లాలో ఎక్కువగా నిర్వహించాలని మెగా కార్పొరేట్ చీఫ్ ఆర్గనైజర్ చీర్ల కిరణ్ కు చూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి ఆటల పోటీలలో పాల్గొనడం ఎంతయినా అవసరమైనదని తెలిపారు, చాలా చక్కగా ప్రతిభ కనబరిచిన ఫైనల్ విజేతలైన జిల్లా పోలీస్ జట్టు, అమర్ రాజా ఇరుజట్లుకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వై.అప్పారావు, రిజిస్టర్ భూపతినాయుడు, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ పిసి రాయల్ విజేతలైన విన్నర్, రన్నర్ జట్లు సభ్యులకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విజేతలకు మెమెంటోస్ అందజేశారు.

ఎకో టూరిజం హబ్‌గా తిరుపతి

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్: జిల్లాలో ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించే ప్రాంతాలను, పర్యాటక శాఖ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ హాల్ నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఎఫ్ఓ పి.వివేక్ తో కలసి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయుటకు సంబంధించి అటవీశాఖ అధికారులు, పర్యాటక శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాను ఎకో టూరిజం ప్రమోషన్ కొరకు హబ్ అండ్ స్పోక్స్ మోడల్ పద్ధతిలో చేపట్టి పేద వర్గాల చేతివృత్తుల కళాకారులు, హ్యాండీక్రాఫ్ట్స్ మెన్ తదితరులకు జీవనోపాధి కల్పించే దిశలో వన ప్రసాదిని కొనసాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎర్రచందనం మొక్కలకు జియో టాగింగ్, ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాలు, ఎకో టూరిజం ప్రమోషన్, వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ కింద ఎర్రచందనం, వాటి ఉత్పత్తులు ముఖ్యమైన అంశాలని, ప్రజల్లో ప్రతి ఒక్కరిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన, బాధ్యత కలిగేలా అన్ని వర్గాల వారిని, కమ్యూనిటీ భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు చేపట్టి సుస్థిరమైన అభివృద్ధి సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించే ప్రాంతాలను గుర్తించి పర్యాటక శాఖ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలన్నారు. తిరుపతి జిల్లాను పర్యాటకరంగా అభివృద్ధి చేయడంతో పాటుగా చేతి వృత్తులవారికి, హస్తకళా కారులకు జీవనోపాధి అవకాశాలు కల్పించుటకు అటవీ, జిల్లా పర్యాటక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యాటక శాఖ ద్వారా కల్యాణి డ్యామ్, జూపార్క్ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, పర్యాటక శాఖ ఆర్డి రమణ ప్రసాద్ కి సూచించారు. చేతి వృత్తుల వారికి, హస్తకళాకారులకు ఎర్రచందనంతో వివిధ రకాల బొమ్మలు తయారు చేసి వారు విక్రయించుకొనేందుకు పర్యాటక ప్రాంతాలలో స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- వీఆర్‌ఓలు బాధ్యతా యుతంగా విధులను నిర్వర్తించండి - జిల్లా ఇన్చార్జి కలెక్టర్

విశాలాంధ్ర – చిత్తూరు: ప్రజల నుండి అందిన రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలని ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జి. విద్యాధరి వీఆర్వోలను హెచ్చరించారు..బుధవారం ఐరాల మండల తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా రెవిన్యూ సమస్యల పరిష్కారం నిమిత్తం తహసిల్దార్కార్యాలయానికి రావడం జరుగుతుందని సమస్యల నిమిత్తం వచ్చే ప్రజలతో సావధానంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని నిర్ణీత గడువు లోపల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవిన్యూ

2లో

రివర్ ఎలక్ట్రిక్ స్కూటర్ స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి: బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీ సంస్థ రివర్, తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన స్టోర్ ను టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, ఆర్టీవో మురళీమోహన్ బుధవారం ప్రారంభించారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని పాత హీరో హోండా షోరూం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రివర్ స్టోర్ కస్టమర్‌లకు ఇండీ, యాక్సెసరీలు, మర్చండైజ్ తో సహా అన్ని రివర్ ఉత్పత్తుల శ్రేణిని ప్రత్యక్షంగా చూసే అవకాశం ఇది అందిస్తుందన్నారు. దాదాపు 829 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రివర్ స్టోర్ రేణిగుంట రోడ్డు లో సాస్త ఆటోమోటివ్ భాగస్వామ్యంతో ప్రారంభించబడిందని, తిరుపతిలోని ఈ స్టోర్ ఉత్సాహపూరితమైన వాతావరణాన్ని కలిగి ఉంది. నదీ ప్రవాహాన్ని గుర్తుకు తెచ్చే 'ఫ్లో లైన్లు' తో బ్రాండ్ సౌందర్యాన్ని ప్రదర్శించడానికి వైవిధ్యంగా రూపొందించబడింది. స్టోర్ సౌందర్యంలో ప్రధాన ఆకర్షణగా ఇండీ నిలుస్తుందన్నారు. రోజువారీ జీవితంలో ఇండీ ఎలా మిళితం అవుతుందో వర్ణిస్తూ అత్యంత జాగ్రత్తగా రూపొందించిన ప్రాంగణం ఇది . ఈ కథనం నది తత్వానికి అనుగుణంగా ఉంటుంది, ప్రజలను వారు ఎక్కడ నుండి వచ్చారో, వారు ఎక్కడ ఉండాలనుకుంటున్నారో అక్కడికి తీసుకువెళుతుంది. గత ఏడాది డిసెంబర్‌లో విశాఖపట్నంలో స్టోర్‌ను ప్రారంభించడంతో రివర్ ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది. ఈ కంపెనీ ప్రస్తుతం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, హుబ్లీ, విశాఖపట్నం, కొచ్చి, కోయంబత్తూరు, మైసూరులో 13 అవుట్‌లెట్‌లను నిర్వహిస్తోంది. రాబోయే కొద్ది వారాల్లో రివర్ తమ కార్యకలాపాలను త్రివేంద్రం, వెల్లూరు, తిరుపూర్, బెల్గాం, పూణేలకు విస్తరించనుంది. మార్చి 2025 చివరి నాటికి, భారతదేశం అంతటా 25 స్టోర్లను తెరవాలని రివర్ ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. ఇండీ ధర రూ1,42,999 (ఎక్స్-షోరూమ్, తిరుపతి). కస్టమర్‌లు టెస్ట్ రైడ్‌ల కోసం స్టోర్‌ని సందర్శించవచ్చు, మర్చండైజ్ ను బ్రౌజ్ చేయవచ్చు, ఇండీని బుక్ చేసుకోవచ్చు. వారు రైడరివర్ .కంలో టెస్ట్ రైడ్‌లను బుక్ చేసుకోవచ్చు, ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేయవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఆలయ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆసుపత్రి ప్రారంభించిన కడా పీడీ మరియు ఆర్టీసీ వైస్ చైర్మన్లు



విశాలాంధ్ర-తిరుపతి: మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ కి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ ఆవరణలో ప్రజలకు అందుబాటులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం మరియు కుప్పం కడా అధికారి వికాస్ మర్మత్ ఈ మాస్ ఆసుపత్రి డైరెక్టర్ జాకబ్ లు బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈమాస్ వారి సౌజన్యంతో కంటి సమస్యలతో బాధపడుతున్న మండల ప్రజలకు అందుబాటులో అధునాతన పరికరాలతో ఉచితంగా కంటి వైద్య చికిత్సలు అందించనున్నట్లు గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనుభవలైన వైద్య బృందంతో పరీక్షలు నిర్వహించి సమస్యలను చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి టిటిడి బోర్డు చైర్మన్ శాంతారామ్, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, మునస్వామి, చిన్నికృష్ణ, చలపతి, రామ్మూర్తి, మరియు ఈమాస్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నాలుగవ దీక్షాంత సమారోహం

విశాలాంధ్ర-తిరుపతి : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తిగారు రేపు 20.03.2025 తేదీన ఉదయం 10.00 గంటల నుండి మహతి ఆడిటోరియం నందు జరగబోయే విశ్వవిద్యాలయ 4వ దీక్షాంత కార్యక్రమం గురించి విషయాలను వెల్లడించారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నాలుగవ దీక్షాంత సమారోహం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో రేపు అంగరంగ వైభవంగా జరగనున్నది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం కులాధిపతి, పద్మభూషణ బిరుదాంగితులు ఎన్.గోపాలస్వామి అధ్యక్షత వహించనున్నారు. ముఖ్యాతిథిగా గౌరవనీయులు పద్మశ్రీ బిరుదాంకితులు, తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం పూర్వకులాధిపతులు, ఆర్థికవేత్త, సంస్కృత విద్వాంసులు, డాక్టర్ వి.ఆర్. పంచముఖి ముఖ్యాతిథిగా పాల్గొంటారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి అతిథులకు స్వాగతం పలుకుతారని తెలియజేశారు. బాల్యం నుండే విద్యార్థులకు బాలకేంద్రాల ద్వారా సంస్కృతాన్ని ప్రతి శనివారం, రవివారం ఉచితంగా విశ్వవిద్యాలయం ద్వారా నేర్పించడం జరుగుతుందని, ఈ సంవత్సరం 2242 బాలలు ఈ కేంద్రం ద్వారా సరళంగా సంస్కృతాన్ని అధ్యయనం చేసారని తెలియజేశారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా 75 మంది విద్యార్థులు విద్యావారిధి (పి.హెచ్.డి) పట్టాలను ఛాన్సర్ చేతుల మీదుగా అందుకోనున్నారు. అలాగే ఆచార్య, ఎం.ఏ, ఎం.ఎస్సి, బి.ఏ, బి.ఎస్.సి, ఎం.ఎస్సి యోగాధెరపి, సర్టిఫికెట్ మరియు డిప్లమో ప్రమాణపత్రాలను విద్యార్థులు అందుకోనున్నారు. మొత్తం ఈ సంవత్సరంలో వివిధ కోర్సులలో అర్హత పొందిన 564 మంది విద్యార్థులు పట్టభద్రులు కానున్నారు. ఈ దీక్షాంతకార్యక్రమం తిరుపతి స్థానిక మహతి ఆడిటోరియంలో ఉదయం 10:00 గంటలకు ప్రారంభం కానున్నది వివరించారు. ఉపకులపతులతో పాటు విశ్వవిద్యాలయం పరీక్షానియంత్రణాధికారి ఆచార్య కంభంపాటి సాంబశివమూర్తి పాల్గొని రేపు జరుగబోయే 4వ దీక్షాంత సమారోహం వివరాలను తెలిపారు. సంస్కృత అధ్యయన-అధ్యాపనంలో అగ్రగామిగా ఉన్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత భాషాధ్యయనానికి, భారతీయ సంస్కృతి ప్రచారానికి మరింత కృషిచేయనున్నదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విసి ఓఎస్డి రఘునందన్, ప్రజాసంబంధాధికారి ఆచార్య రమేశ్, సహ ప్రజా సంబంధాధికారులు డా. కనపాల కుమార్, డా.బల్టీ దాస్, కన్వీనర్ డా. ఎమ్.జి.నందనరావు లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి) సదస్సులలో అందిన అర్జీలు, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారం నకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలని సకాలంలో పరిష్కారానికి తహసిల్దార్ కి సహకరించాలన్నారు.పిటీషనర్ కి నోటీసు ఇచ్చిన సమయంలో కనపరిచిన తేదీ నే విచారణకు హాజరు కావాలని అర్జీదారులను తెప్పించుకోరాదని సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదని ఈ విషయంలో ఎటువంటి అలసత్వం వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ప్రజలకు అందజేయాలన్నారు.అర్జీల పరిష్కారానికి సంబంధించి ఐ వి ఆర్ ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల స్పందన తెలుసుకోవడం జరుగుతున్నదని ఈ స్పందనలో వాళ్ల అడిగే ప్రశ్నలకు అర్జీదారులు చెప్పే సమాధానంలో ఎటువంటి నెగటివ్ ఫీడ్ బ్యాక్ తెలిపిన ఆ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలతో సహా జిల్లాలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోనికి తీసుకొని బాధ్యతాయుతంగా పారదర్శకంగా పనిచేయాలని ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వి ఆర్ ఓ లను హెచ్చరించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో మొక్కల పెంపకం చేపట్టాలని కార్యాలయము పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ మహేష్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు డిజిటల్ భద్రతపై కార్యశాల

మహిళలు కెమెరాలు కలిగిన వస్తువుల పట్ల, బయట ప్రదేశాలలో అప్రమత్తంగా ఉండాలి ఆచార్య సుధారాణి

విశాలాంధ్ర-తిరుపతి: ఎస్వీయూ మహిళ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో "మహిళకూ సాంకేతికత, డిజిటల్ భద్రత లో రక్షణ,నివారణ చర్యలు" అనే అంశంపై ఒక్కరోజు కార్యశాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథి వర్సిటీ ఆర్ట్స్ కళాశాల అధ్యక్షురాలు ఆచార్య సుధారాణి మాట్లాడుతూ ఈ సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా మహిళలు వ్యక్తిగత అంశాలలో సాంకేతిక సామాగ్రి, వస్తువులు, యాప్ లు ఉపయోగించేటప్పుడు వాటి యొక్క అనుమతులలో జాగ్రత్తగా గమనించి అనుమతులు మంజూరు చేయాలని, ముఖ్యంగా కెమెరాలు కలిగిన సాంకేతిక వస్తువుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. అదేవిధంగా బయట ప్రదేశాలలో సంచరించేటప్పుడు, సేద తీరేటప్పుడు కూడా అప్రమత్తతో ఉండాలని ఆమె అన్నారు. విభాగాధిపతి ఆచార్య సాయి సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, మహిళ పరిశోధకులు, మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.

సంతల వేలం ద్వారా పంచాయతీకి రూ.28 లక్షలు ఆదాయం..

విశాలాంధ్ర-వి. కోట: మేజర్ పంచాయతీ వి. కోట పరిధిలోని దిన, వారపు సంతలకు బుధవారం నిర్వహించిన వేలం ద్వారా పంచాయతీ కి 28 లక్షల 3 వేల 100 రూపాయలు ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ లు తెలిపారు. ఏటా నిర్వహించే సంతల వేలం పాటలు కుప్పం డి ఎల్పివో రాధాకృష్ణ, స్థానిక ఇవో పీఆర్డి వెంకటరమణల సమక్షంలో నిర్వహించారు. కాగా వారపు సంత వసూళ్లకు రూ, 2 లక్షల 90 వేలకు అలాగే దినసరి కూరగాయల దుకాణాల ద్వారా గుత్త వసూళ్ల రూ, 5 లక్షల 10 వేలకు శైలజ వేలం పాట ద్వారా హక్కులు పొందారు. ప్రైవేటు వాహనాల వసూళ్ల కోసం ఇక్బాల్ 10 లక్షల 71 వేలకు హక్కులు పొందారు. పశువుల సంతకు అరుణ్ కుమార్ 4లక్షల 40 వేలకు గొర్రెల సంతకు రెడ్డిభాస్కర్ 4 లక్షల 73 వేలకు హక్కుల ను పొందగా జంతు వధశాల లో వసూళ్లకు ఉదయ్ కుమార్ 19 వేల ఒక వందకు హక్కుల ను పొందినట్లు తెలిపిన సర్పంచ్ లక్ష్మమ్మ వివిధ వేలం పాట ద్వారా హక్కుల ను పొందిన వారు వారం రోజుల లోపు వేలం లో పాడిన డబ్బులు మొత్తం చెల్లించి రశీదులు పొంది గుత్త వసూళ్లు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా మోహన్ బాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - చంద్రగిరి: విద్యాదాత యంబియు విశ్వవిద్యాలయ చాన్సలర్ మంచు మోహన్ బాబు జన్మదిన వేడుకలను బుధవారం ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నర్సింగ్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. బుధవారం మోహన్ బాబు విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు జన్మదినం సందర్భంగా విశ్వవిద్యాలయంలోని నర్సింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు 500 మందికి పైగా రక్తదానం చేశారు.అలాగే సుమారు 100 మందికి పైగా ఆయన అభిమాన విద్యార్థులు అవయవ దానం కోసం విద్యార్థులు రిజిష్టరు చేసుకున్నారు. తిరుపతిలోని స్విమ్స్, రుయా, మెటర్నిటీ, అమర, మారుతి, ఎస్టీఆర్ ట్రస్ట్ హాస్పిటల్స్ వారి వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని యంబియు ప్రో. ఛాన్సలర్ మంచు విష్ణు సతీమణి విరానికా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యంబియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వినయ్ మహేశ్వరి, ప్రో.వోస్ట్ డాక్టర్ నాగరాజ రామరావ్, వైస్ ఛాన్సలర్ ప్రో. కరుణాకరన్, నర్సింగ్ పిన్సిపాల్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

కాణిపాకం టోల్ గేట్ ద్వారా రూ. 2.12 కోట్లు ఆదాయం

విశాలాంధ్ర-చిత్తూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం టోల్ గేట్‌కు టెండర్ నిర్వహించిన అత్యధికంగా రూ 2.12 కోట్లకు దాఖలైన టెండర్‌ను అధికారులు ఖరారు చేశారు. కాణిపాకం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం వాహనాల టోల్గేట్ వసూళ్లకు నిర్వహించిన సీల్డ్ టెండర్లలో రూ. 2కోట్ల 12 లక్షలు ఆదాయం లభించినట్లు పంచాయతీ కార్యదర్శి కుసుమకుమారి, సర్పంచ్ శాంతి సాగర రెడ్డి తెలిపారు. షీల్డ్ టెండర్లో అధిక మొత్తంలో వేసిన గుత్తేదారుడు సెల్వం దక్కించుకున్నారు. గుత్తేదారులు నిబంధనల మేరకు ఏడాది పాటు టోల్గేట్ వసూలు చేయాలని అధికారులు సూచించారు.

భక్తులకు అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం కుందేటి వారివీధిలో వెలసిన గంగమ్మ ఆలయం వద్ద బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ మిద్దెల హరి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అంతకు మునుపు గంగమ్మ అమ్మవారికి మిద్దెల హరి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ... ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కాగా ఎస్టీ కాలనీవాసులు అందరూ మిద్దెల హరి దాతృత్వానికి కృతజ్ఞతలు తెలియచేశారు.

మార్చి 25 నుండి శ్రీ తాళ్లపాక అన్నమయ్య 522వ వర్ధంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి 522వ వర్ధంతి ఉత్సవాలు మార్చి 25 నుండి 29వ తేదీ వరకు అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యాన మందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా నిర్వహించనున్నారు. మార్చి 25వ తేదీ ఉదయం 6 గంటలకు తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా జరుగనుంది. మార్చి 26న తిరుమలలో సాయంత్రం 6 గంటలకు నారాయణగిరి ఉద్యాన వనంలో సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహిస్తారు.మార్చి 26 నుంచి 29వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద సాయంత్రం వేళ ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయాల్లో మార్పు

విశాలాంధ్ర-గూడూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి నిర్వహిస్తున్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎండ తీవ్రత కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. గూడూర్ డివిజన్లోని అధికారులు, ప్రజలు ప్రజా పరిష్కార వేదిక సమయాల్లో మార్పును గమనించాలని పేర్కొన్నారు.

రాస్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్రీయ సేవా సమితి, టాటా ట్రస్టు క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ లో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్లు దేవకి, సుచిత్ర హాజరై వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మనిషి జీవితం నేడు పని ఒత్తిడితో యాంత్రికంగా మారడం వలన ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వ్యాధి ముదిరితే తప్ప ఆస్పత్రికి వెళ్లడం లేదన్నారు. తమ బ్యాంకు ద్వారా మహిళలకు మాత్రమే జీవన సమృద్ధి ఖాతా ప్రారంభించి రూ. 15 వేలు నిల్వ తమ ఖాతాలోనే ఉంచుకోగలిగితే క్యాన్సర్‌కి రూ.10 లక్షలు, ప్రమాదానికి రూ.5లక్షలు బీమా ఉచితంగా ఉంటుందన్నారు. టాటా ట్రస్ట్ ప్రోగ్రాం మేనేజర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిని ఆదిలోనే గుర్తించకపోతే ఎన్నో సమస్యలకు గురికావలసి వస్తుందన్నారు. క్యాన్సర్ కు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందవచ్చన్నారు. రాస్ ద్వారా అందించే ఈ సేవలు సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలకు, పురుషులకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి అన్ని పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య బాబు బృందం, రెడ్డికుమారి, వినీత, మహేంద్ర, రాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, వినోద్, ముఖేష్, రాజేశ్వరి, శబ్బు, గౌతమి, జయలలిత, నాగలక్ష్మి, జయంతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో భక్తులకు రక్షిత మంచినీరు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పానగల్ లో వెలసిన పొన్నాలమ్మ ఆలయంలో దాతల సాయంతో భక్తులకు రక్షిత మంచినీరు వసతి కల్పించారు. పొన్నాలమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు రక్షిత మంచినీరు అందించాలని ఆలయ కమిటీ అధ్యక్షులు పుదూరు లక్ష్మణ్ రెడ్డి దాతలను కోరారు. ఇందుకు స్పందించిన మురళీ కృష్ణారెడ్డి, సంగీత, గోపీనాథ్ రెడ్డి, వాణి, తిరుక్కాల వెంకట ముని బాబు, బసివిరెడ్డి సుబ్బరామిరెడ్డి, పోలి ముని రామయ్య, సువర్ణం రవి అనే దాతలు ఆలయ ప్రాంగణంలో రక్షిత మంచినీరు ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటును బుధవారం ప్రారంభించారు. దాతలకు ఆలయ కమిటీ ఛైర్మన్ పుదూరు లక్ష్మణ్ రెడ్డి, ఆలయ అర్చకుడు జగదీష్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియచేశారు.

ఎనిమిదోవ రోజు నిరాహార దీక్ష

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో తహశిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, నాయకత్వంలో ఇంటి స్థలాల పోరాట రిలే నిరాహార దీక్ష ఎనిమిదోవ రోజుకు చేరుకుంది. గ్రామంలో ఉమ్మడి కుటుంబాలతో జీవితాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వేరు కాపురంతో ఉండాలంటే ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. కణమనంబేడు రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్లలో 252, 253, 254 ఉన్న భూమి ఆక్రమణకు గురైంది. గ్రామంలో ఉన్న నిరుపేదలకు అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని గత మూడు నెలలుగా సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్య వైఖరితో రిలే నిరాహార దీక్షతో సాధించడానికి సమయం ఇదేనన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. అధికారులు స్పందించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట కమిటీ సభ్యులు చింతపూడి రమణయ్య, ఉచ్చూరు సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాంగ పుస్తక ఆవిష్కరణ

విశాలాంధ్ర-గూడూరు: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య గూడూరు శాఖావారి ఆధ్వర్యంలో బ్రాహ్మణ భవనంలో పంచాంగ పుస్తక ఆవిష్కరణ చేశారు. నెల్లూరు వాస్తవ్యులు పండితులు, గొప్ప బ్రాహ్మణ బంధు ప్రీతి కలవాడు, ఆలూరు శిరోమణి శర్మ, వారి ధర్మపత్ని చేతుల మీదుగా పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా శిరోమణి శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులు అందరూ కూడా ఉగాది విశ్వావసునామ సంవత్సర పంచాంగం మీ ఇంటిలో చదవాలి అనికోరారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ శిరో మణి శర్మ సేవా భావం కల్గిన వారు అని కొనియాడారు. అదేవిధంగా ఉగాది రోజున బ్రాహ్మణులు అందరు పంచాంగం పఠనం చేయాలనిన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు అని మెళ్ల శివ కుమార్, సెక్రెటరీ చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి విద్యా లలిత దూబగుంట శ్రీనివాస్ వేప కొమ్ము నరసింహారావు, కడివేటి రామ్మూర్తి తదితరులు కనుమెళ్లవెంకట సుబ్బారావు, ఏలూరు ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

క్రై సంస్థ సహకారంతో స్టెమ్ ల్యాబ్ ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు ఉన్నత పాఠశాలలో బుధవారం క్రై సంస్థ సహకారంతో తిరుపతి ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో స్టెమ్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం పట్ల ఆసక్తి పెంచడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ, మండల విద్యాశాఖాధికారిణి భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు మునిరామయ్య, ప్రగతి సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కె నారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మంజుష, శ్రీకాళహస్తి మండల కో-ఆర్డినేటర్ ప్రభాకర్, రేణిగుంట మండల కో-ఆర్డినేటర్ జయలక్ష్మి, ఏర్పేడు మండల కో-ఆర్డినేటర్లు శిరీష బోస్, సిబ్బంది రామచంద్ర, సురేష్, రాజేశ్వరి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కూనాటి సురేష్‌కు గురుబ్రహ్మ అవార్డు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కూనాటి సురేష్ గురుబ్రహ్మ అవార్డు దక్కింది. విశాఖపట్నంకు చెందిన సెయింట్ మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు కూనాటి సురేష్ కు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డును విశాఖపట్నంలో జరిపిన కార్యక్రమంలో కూనాటి సురేష్ అందుకోవాల్సి ఉంది. అయితే కార్యక్రమానికి వెళ్ళలేని కారణంగా ఈ అవార్డును ఆ సంస్థ వారు బుధవారం పాఠశాలకు పోస్టు ద్వారా పంపించారు. ఈ సందర్భంగా కూనాటి సురేష్ ను పలువురు అభినందించడంతో పాటు శుభాకాంక్షలు తెలియచేశారు.

బస్టాండ్ గదుల వేలంలో కూటమి సభ్యులే అధికం

విశాలాంధ్ర-పెనుమూరు: మండల కేంద్రంలోని పెనుమూరు బస్టాండ్ లో 70 లక్షలతో 24 రూములను ప్రభుత్వ హయాంలో నిర్మించడం జరిగింది ఇందులో భాగంగా ప్రభుత్వం మారినాక బుధవారం ఉదయం డి ఎల్ పి ఓ పార్వతమ్మ ఈ ఓ ఆర్ డి మహేశ్వర్ రెడ్డి. పంచాయతీ సెక్రెటరీ ప్రభు కిరణ్. ఆధ్వర్యంలో వేలంపాటి నిర్వహించడం జరిగింది ఇందులో కూటమి సభ్యులకే అధిక రూములను వేలంపాటలో పాడుకోవడం జరిగిందన్నారు. ఎటువంటి ఘర్షణలు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పాటు నిర్వహించడం జరిగింది. పెనుమూరు పంచాయతీకి లక్షల ఆదాయం వస్తుందని అభివృద్ధి బాగుంటుందని తెలిపారు.

సామూహిక లక్ష తులసి పూజ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని శ్రీ అళఘనాథ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు స్వామి అమ్మవార్లు కు విశేషాలంకరణ ఏర్పాటు చేసి విశేషాలంకరణ ఏర్పాటు చేసి సామూహిక లక్ష తులసి పూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా పాబోలు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ఛలో విజయవాడను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గూడూరు: ఏ.పీ.ఎస్.ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి నారాయణ కోరారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ డీఎం కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు బివి.రమణయ్య, నాయకులు ఎం.శేషయ్య, హరినాథ్, రత్నయ్య, రాజారాం, జయచంద్ర, గోపాల్ రెడ్డి, విజయలక్ష్మి, తిరుపతమ్మ, రావమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-చిత్తూరు: కే.జీ.బీ.వీ లలో ప్రవేశాల కోసం ఆన్లైన్ ధరఖాస్తులు స్వీకరణ చేయడం జరుగుతున్నదని అడిషనల్ పాజెక్టు కో ఆర్డినేటర్ ఎం. వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలోని 8 కే.జీ.బీ.వీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6,11 తరగతుల్లో బాలికల ప్రవేశాల కోసం ఆన్లైన్ ధరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్లైన్ ధరఖాస్తులును మార్చి 22 నుండి ఏప్రిల్ 11 వరకు స్వీకరించబడును.అనాధలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ, బి పి సి బాలికలు మాత్రమే ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన ధరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడతాయని తెలిపారు. ఏవైనా సమస్యలు, సందేహాలకు 7075159996, 7075039990 నంబర్లు సంప్రదించాలని ఆ ప్రకటన లో తెలిపారు.

ఇంటర్ పరీక్షలక పరీక్షలకు 33 మంది హాజరు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పబ్లిక్ పరీక్షలు బుధ వారం ప్రశాంతంగా జరిగాయని, ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 33 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐఓ జీ.వి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 01 జనరల్ కేంద్రము లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మోడ్రెన్ లాంగ్వేజ్ పేపర్ -1, జియోగ్రఫీ పేపర్ -1 పరీక్ష జరిగాయి. ఈ పరీక్షకు జనరల్ 33 మంది మొత్తం 33 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. పరీక్షా కేంద్రాలలో త్రాగు నీటి వసతి, పోలీసు బందోబస్తు, మెడికల్ క్యాంపు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పర్యవేక్షణ, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా బస్సుల సౌకర్యం కల్పించామని ఆర్ఐఓ ఆ ప్రకటనలో తెలిపారు.

సత్యవేడులో మార్చి 22వ తేదీ ఉద్యోగమేల

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రాంగణంలో మార్చి 22వ తేదీన ఉద్యోగ మేళ జరుగుతుందని స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషా దేవి పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, డిఆర్డిఏ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఉద్యోగమేళాలో వీల్స్ ఇండియా, ఎయిర్టెల్,బ్లూస్టార్ కు సంబంధించిన కంపెనీలకు సంబంధించి 140 పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతుందన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చును అన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు వారి బయోడేటా తో పాటు ఆధార్, అర్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలన్నారు.అయితే ఉద్యోగమేళాకు సంబంధించి అభ్యర్థులు ముందుగానే https//naipunyam.ap.govt.in వెబ్సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం పాలిటెక్నికల్ కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి మొబైల్ నెంబర్ 9440374535 ను సంప్రదించాలన్నారు.

బాలికల ప్రాధాన్యతను తెలియజేయండి

-ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బాలుర కంటే బాలికల లింగ నిష్పత్తి ప్రమాద స్థాయికి చేరుకుంటోందని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. లింగ వివక్షకు తావు లేకుండా బాలికల ప్రాధాన్యతపై నియోజకవర్గ వ్యాప్తంగా అవగాహన కల్పించాలని సూచించారు. లింగ నిష్పత్తిలో భేదాలకు కారణమవుతున్న లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయంలో పీసీపీఎన్డీటీ చట్ట అమలులో భాగంగా బుధవారం ఉప జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ, సలహా కమిటీ సమావేశాన్ని సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో డెకాయ్ ఆపరేషన్లు విధిగా నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. స్కాన్ సెంటర్లు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు నిర్వహించేందుకు తప్పనిసరిగా డీఎం అండ్ హెచ్ఓ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డిప్యూటీ డీఎమ్ అండ్ హెచ్ వో డాక్టర్ మృదులవాణి, శ్రీ కాళహస్తి ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ మధు, డిప్యూటీ డెమో కిరణ్ కుమార్, సీడీపీఓ శాంతి దుర్గ, లీగల్ అడ్వైజర్ ఇంద్రాణి, పలువురు ఎన్జీవోలు ఎన్జీవోలు పాల్గొన్నారు.

23న రాయలసీమ మాలల సింహగర్జనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తిరుపతి: సుప్రీంకోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ మైదానంలో జరుగనున్న రాయలసీమ మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని రాయలసీమ మాలల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతిలోని బాలాజీ కాలనీ సమీపంలో ఉన్న అంబేద్కర్ భవనంలో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో 90 లక్షల పైగా ఉన్న మాలలను అనేక రకాలు గా ఇబ్బందులకు గురి చేసి అనగా త్రొక్కాలనిదురుద్దేశంతోనే సుప్రీంకోర్టు తీర్పులను క్యాబినెట్ లోను నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ తీర్పుకు వ్యతిరేకంగా మాల లందరూ కలిసికట్టుగా రావాలని తిరుపతిలో జరగనున్న మాలల సింహ గర్జన గౌరవ సభను జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అశోకరత్నం, సుదర్శన్, ప్రభాకర్ కుర్ర కాల్వమురళి మల్లారపు మధు, ధన శేఖర్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్వీయూ విద్యార్థులు కడప జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రదేశాల సందర్శన

విశాలాంధ్ర-తిరుపతి: ఎస్వీయూలోని టూరిజం, సీప్ స్టడీస్ విద్యార్థులు కడప జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. భారతదేశంలో ఉన్నటువంటి స్థానిక ప్రదేశాలను ప్రోత్సహించడంలో భాగంగా కడప జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలైన ఒంటిమిట్ట గండికోట నందలూరు ప్రదేశాలను విద్యార్థులు మంగళవారం సందర్శించారు. పర్యాటక విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించడంలో భాగంగా కడప జిల్లాలోని ఒంటిమిట్ట రామాలయం, గండికోట మరియు నందలూరులోని సౌమ్య నారాయణ స్వామి ఆలయాలను సందర్శించారు. ఇందులో భాగంగా గండికోటలో ఉన్న అడ్వెంచర్ టూరిజం పార్క్ ను సందర్శించి అక్కడ మెరుగుపరచాల్సినటువంటి అవకాశాలపై అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వియు అధ్యాపకులు ఆచార్య ప్రయాగ, ఆచార్య పద్మజ, డాక్టర్ తిమ్మప్ప, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కోలా

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మాజీ రాజ్యసభ సభ్యులు, సినీ నటుడు డాక్టర్ మంచు మోహన్ బాబుకు బిజేపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం విద్యానికేతన్ కాలేజ్ నందు కుటుంబ సమేతంగా వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, అనంతరం కలంకారి శాలువాతో సత్కరించి, గజమాలను వేసి శ్రీకాళహస్తి స్వామి- అమ్మవార్ల తీర్థప్రసాదములు అందజేశారు. శ్రీ జ్ఞానప్రసూనాం బికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారు, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి కృపాకటాక్షములతో మీరు నిండు నూరేళ్ళ పాటు ఆయురారోగ్యములతో, సంతోషం గా ఇలాంటి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని మనస్పూర్తిగా ఆ భగవంతుణ్ణి ప్రార్థించినట్లు కోలా ఆనంద్ తెలిపారు.

నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-పూతలపట్టు: మీసేవ కేంద్రాలను పునరుద్ధరణ చేస్తామని నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ఆయన చిత్రపటానికి పూతలపట్టులో పాలాభిషేకం బుధవారం 19వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం జరిగినది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వర్యులు నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో మీసేవ కేంద్ర నిర్వాహకులకు ఇచ్చిన హామీని నిజం చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో మీ సేవ సేవలను పునరుద్ధరిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పూతలపట్టు నియోజకవర్గం మీసేవ నిర్వాహకుల ఆధ్వర్యం లో నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-గూడూరు: తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు చేపడ తామని గూడూరు తహసిల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణానికి చెందిన మొగిరాల నాగేశ్వర రావు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం అప్లై చేసుకున్నాడని, కుటుంబ సభ్యుల వివరాలు దాచిపెట్టి సర్టిఫికెట్ ను పొందడం జరిగిందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారించి, అతని పై కేసు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు. ఆ సర్టిఫికెట్ను రద్దు చేయుటకు జిల్లా కలెక్టర్‌కి సిఫారసు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా నకిలీ పత్రాలు సృష్టిస్తే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుం దన్నారు. మండల ప్రజలు దళారులను నమ్మి మోస పోవద్దు అని తెలిపారు.

ఏప్రిల్ 6 నుండి చంద్రగిరి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6 నుండి 14వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 8 నుండి 9 గంటల మధ్య ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఏప్రిల్ 10వ తేదీ సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు హనుమంత వాహనంపై స్వామివారు విహరించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఏప్రిల్ 11వ తేదీ ఉదయం 9 నుండి 10 గంటల వరకు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.ఏప్రిల్ 12వ తేదీ ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. రూ.750/- చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. ఏప్రిల్ 14వ తేదీ ఉదయం 9 నుండి 10 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సర్లకు, చక్రత్తాళ్వార్‌కు వసంతోత్సవం నిర్వహించనున్నారు. తరువాత ఉదయం 10 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణముతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఏప్రిల్ 15వ తేదీ ఉదయం 10.30 నుండి రాత్రి 11.30 గంటల వరకు శ్రీ రామపట్టభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు ఊంజల సేవ జరుగనుంది. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, సంగీత కచేరీలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చంద్రబాబు, పెద్దిరెడ్డి లోపాయికారి ఒప్పందంతో టిడిపి కార్యకర్తలు బలి!

విశాలాంధ్ర-పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లి పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో వైసీపీ నాయకుల చేతిలో హత్య కాబడిన టిడిపి నేత రామకృష్ణ కుటుంబాన్ని బుధవారం బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ పరామర్శించి వారికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించడం జరిగింది అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైసిపి నాయకులు మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లోపకారి ఒప్పందంతో టిడిపి నాయకులు కార్యకర్తలు బలి అవుతున్నారని ఆయన పేర్కొన్నారు లోపు కారి ఒప్పందం ఉండడం వలన ఎన్నో భూమి కుంభకోణాలు లిక్కర్ స్కాం మైన్స్ స్కాం జరిగాయని లక్షల కోట్లు లూటీ చేసి ప్రజాధనాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి కుటుంబం దోచుకున్నారని అన్ని విచారణ సంస్థలు చెబుతున్న ఇంతవరకు పెద్దిరెడ్డి కుటుంబం పైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎటువంటిచర్యలు చేపట్టలేదు అన్నారు గత వైసిపి ప్రభుత్వంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వందలాది మంది టిడిపి నాయకులు పై కార్యకర్తలపై కేసులు పెట్టి వారిని ఊర్లో లేకుండా చేసిన చంద్రబాబునాయుడుకు మాత్రం కనికరం రాలేదన్నారు అటువంటి ఈ నాయకులను నమ్మి కార్యకర్తలు మోసపోకండి ఇకనైనా నాయకులు కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు మరి ముఖ్యంగా టిడిపి కార్యకర్త రామకృష్ణ పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన పోలీసులు నిర్లక్ష్యం వల్ల ఆయన హత్య కబడి ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు అలాంటి పోలీసులు పైన ఒకరిద్దరు పైన చర్యలు చేపట్టారు గాని పూర్తిగా వైసీపీకి ఏజెంట్లుగా పనిచేస్తున్న వారందరూ పైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు ఏది ఏమైనా ఒక బీసీ కులాన్నికి చెందిన వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమన్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను గాడిలో పెట్టి ప్రజలకు పనిచేసే విధంగా చూడాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిసివై నాయకులు సాంబ రమేష్ గుట్టపల్లి వెంకటేష్ పూల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైనేరమ్మ ఆలయ పూజారి బుర్ర కృష్ణ మందడి మృతి

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోని పాత డేరా కండిగ కు చెందిన నై నేరమ్మ ఆలయ పూజారిగా పనిచేసిన బుర్ర కృష్ణ మందడి 75 బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందడం కుటుంబ సభ్యులకు గ్రామస్తులకు బాధ కలిగించింది. ఈయన మృతి తీరని లోటు అని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. మృతి చెందిన పూజారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. పూజారి మృతికి కార్వేటి నగరం మండల వాసులే కాకుండా పుత్తూరు నగరి ప్రాంతాల నుంచి కూడా పూజారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆ గ్రామం అంతా కన్నీరు మున్నీరయింది. నివాళులర్పించిన వారిలో ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు విశ్రాంతి ఉపాధ్యాయులు సర్పంచులు, ఎంపీటీసీలు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు కూడా ఉన్నారు..

విషపురుగు కాటుకు బాలుడు మృతి

విశాలాంధ్ర-తడ: మండల పరిధిలోని వేనాడు పంచాయతీ మూల గ్రామంలో ఓ బాలుడిని విష పురుగు కాటేయడంతో మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తడ ఎస్ఐ కొండప్ప నాయుడు సమాచారం మేరకు వేనాడు పంచాయతీ మూల గ్రామానికి చెందిన మల్లు కందేశ్ కుమారుడు మల్లు తేజేష్ (7)ను సమీపంలోని వారి అత్తగారి ఇంటిలో ఈనెల 9వ తేదీన వదిలి వచ్చాడని అదే రోజు రాత్రి తేజేష్ నేలపై నిద్రిస్తుండగా విషపురుగు కాటేయడంతో వాంతులు చేసుకోవడంతో వెంటనే సూళ్లూరుపేట లోని వీనస్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం చెన్నై లోని కంచి కామకోటి వైద్యశాలకు తరలించారని మూడు రోజుల అనంతరం చిన్నపిల్లల ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మంగళవారం రాత్రి తేజేష్ మృతి చెందాడని బాలుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తిదాయకం సునీత విలియమ్స్

విశాలాంధ్రు-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని ఎస్‌విఎస్ఎస్‌సి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సునీత విలియమ్స్ క్షేమంగా భూమి మీదకు చేరిన సందర్భంను పురస్కరించుకుని కార్యక్ర మం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ ఎల్ బి శంకర్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎనిమిది రోజులలో తిరిగి వస్తానని వెళ్లి సాంకేతిక కారణాల వల్ల 286 రోజు లుగా గగనయానంలో ఉండి నిన్నటి దినమున భూమికి క్షేమంగా చేరడం ఎంతో సంతోషదాయకమన్నారు. వ్యోమగాములు సునీత విలియమ్స్ బుచ్ విల్ మోర్ లు క్షేమంగా భూమిపై కాలు మోపడంను అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగం అధిపతి డాక్టర్ వి.రాజా, డాక్టర్ జె సుబ్రమణ్యం డి. నాగభూషణ రావు, డాక్టర్ సి సల్మా తదితరులు పాల్గొన్నారు.

మహిళలందరూ సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- పులివర్తి సుధా రెడ్డి

విశాలాంధ్ర-పాకాల: చంద్రగిరి నియోజకవర్గంలోని మహిళలందరూ సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాకాల మండలంలోని పంటపల్లి ,పది పట్ల బైలు గ్రామపంచాయతీలలోని మహిళలతో సుధా రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ మహిళలు కేవలం డ్వాక్రా రుణాలను మాత్రమే పొందుతున్నారని, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో అనేక రుణాలు అందజేస్తున్నా యని వీటి గురించి మహిళలు తెలుసుకోవాలన్నారు. మహిళలలో అవగాహన కల్పించడం కోసమే తాను నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజే శారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. పాకాల మండలంలో మహిళల కోసం గార్మెంట్ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. చదువుకున్న యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీలలోని సమస్య లను మహిళలను అడిగి తెలుసుకొని, పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పద్మజా రెడ్డి,టిడిపి మండల కన్వీనర్ నాగరాజు నాయుడు చంద్రగిరి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సావిత్రి, స్థానిక టిడిపినాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అవని డిపాజిట్ పథకం మహిళలకు వరం

సత్యవేడు డిసిసి బ్యాంక్ మేనేజర్ కార్తీక్

విశాలాంధ్ర- సత్యవేడు: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కొత్తగా తీసుకొచ్చిన అవని డిపాజిట్ పథకం మహిళలకు ఒక వరమని తిరుపతి జిల్లా సత్యవేడు డిసిసి బ్యాంక్ మేనేజర్ కార్తీక్ అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశం లో మాట్లాడుతూ అవని డిపాజిట్ పథకం కేవలం మహిళలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో డిపాజిట్ చేసుకున్న వారికి అత్యధికంగా 8.30 శాతం బ్యాంకు వడ్డీ చెల్లిస్తుంద న్నారు. అదే సీనియర్ సిటిజన్ మహిళలకు అయితే 8.40 శాతం వడ్డీ వస్తుంది అన్నారు.అవని డిపాజిట్ పథకం కాలపరిమితి 333 రోజులుగా బ్యాంకు యాజమాన్యం నిర్ణయించిందన్నారు.పథకంలో కనిష్ట డిపాజిట్ 10,000 నుంచి స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు. తమ బ్యాంకులో అవని డిపాజిట్ పథకంలో డిపాజిట్ సొమ్ముకు డిఐసిజిసి ఇన్సూరెన్స్ రక్షణ కూడా ఉంటుందన్నారు.డిపాజిట్ స్వీకరణ మార్చి 7వ తేదీ నుంచి ప్రారంభమైందన్నారు. పథకానికి 2025 మార్చి 31 తుది గడువు అని ఆయన వివరించారు.ఈ పథకంలో డిపాజిట్ చేసి అత్యధిక వడ్డీని పొందాలన్నారు.అవని డిపాజిట్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేనాటి సతీష్ రెడ్డిచే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు టిడిపి తిరుపతి జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి చేతుల మీదగా నాయుడుపేట రూరల్ మండలం వేముగుంట పాలెం పంచాయతీ కాపారస్థులు శ్రీరామ్ సుబ్బయ్యకి రూ. 1,14,325 సిఎంఆర్ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేనాటి సతీష్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఇవ్వడం జరిగినది తెలిపారు. ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కె.వి.రెడ్డి, వేనాటి జనార్ధన్ రెడ్డి, నాయుడుపేట రూరల్ పార్టీ ప్రెసిడెంట్ కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, చేనిగుంట బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అడ్రస్ లేని సంత' ఆదాయం రూ.9,46,000

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని పుంగనూరు రోడ్డుపై శనివారం జరిగే సంత వేలంపాట ఆదా యం అక్షరాల తొమ్మిది లక్షల నలభై ఆరువేల రూపాయలు. బుధవారము పంచాయితీ సచివాలయంలో జరిగి నటువంటి సంత యాక్షన్ నందు మండల ప్రజలు పాల్గొన్నారు, ఆదాయం బాగానే ఉంటుంది కానీ సంత సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటాయి అని గతంలో కూడా ఈ సంత గురించి విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురించడం జరిగినది. సంత జరిపించడానికి పంచాయితీ వారు స్థలాన్ని సేకరించి సౌకర్యాలను కల్పించినట్లయితే ఇంకా వేలంపాట ఆదాయం పెరిగేదని గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

సంఘాల పనితీరును పర్యవేక్షించడానికే లోకోస్ యాప్

విశాలాంధ్ర-సత్యవేడు: స్వయం సహాయక సంఘా ల పనితీరును పర్యవేక్షిం చాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా లోకోస్ యాప్‌ను తీసుకొ చ్చినట్టు సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ (వెలుగు) ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ చెప్పారు.స్థానిక స్త్రీశక్తి భవనంలో లోకోస్ యాప్పై సంఘమిత్రలకు జరిగిన మూడు రోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది.ఈ సందర్భంగా వెలుగు ఏపిఎం డాంగే యాదవ్ మాట్లాడుతూ పొదుపులు,రుణ చెల్లింపులు సహా అన్ని సమాచారానికి సంబంధించి నోట్‌బుక్‌లలో ఉంచే సాంప్రదాయ శైలిని ప్రస్తుతం అనుసరిస్తున్న ఎస్హెచ్ జీలకు ఈ ప్రాజెక్ట్ కొత్త ముఖాన్ని అందిస్తుందన్నారు. పైగా ఈ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు,పొదుపు, ఇతర ఆర్థిక సహాయం వంటి పథకాల ప్రయోజనాలు సులభంగా అందుబాటు లోకి వస్తాయని ఆయన వివరించారు. దీంతోపాటు సంఘం ఏర్పడిన సంవత్సరం, సభ్యుల సంఖ్య, పొదుపు, బ్యాంకు, స్త్రీనిధి రుణాలు, వాయిదాల చెల్లింపులు వంటివి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. తప్పుడు తడక లేకుండా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన నిర్దిష్ట వివరాలను లోకోస్ యాప్లో నమోదు చేయాలని ఆయన సంఘ మిత్రలను కోరారు. ఈ ముగింపు శిక్షణ కార్యక్రమంలో వెలుగు కోఆర్డినేటర్లు పుల్లయ్య, మంగయ్య, అకౌంటెంట్ కాంచన పలువురు సంఘ మిత్రలు పాల్గొన్నారు.

గిరిజనలును ఆదుకోండి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: అధికారులే గిరిజనుల న్యాయం చేయాలని గిరిజ నులు రెవెన్యూ అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం లో బుధవారం మండలంలోని పుత్తేరి గ్రామానికి చెందిన గిరిజనులు రెవెన్యూ అధికారుల మాకు న్యాయం చేయాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ మించల,నల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి లకు వినతి పత్రం ద్వారా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాట్లాడుతూ పుత్తేరి గిరిజన కాలనీలో సుమారు 30 కుటుంబాలు జీవన కొనసాగిస్తున్నాయి. గిరిజన కాలనీ మీదుగా గ్రామంలోకి వెళ్లాలంటే మార్గం ఇదే .. గ్రామానికి చెందిన సుబ్బు రామయ్య యాదవ్ మా కాలనీ వద్ద ఉన్న రహదారిపై గడ్డివామి రోడ్డుకు అడ్డంగా వేయడంతో కాలనీలోకి వెళ్లాలంటే దారి లేక అవస్థలు పడుతున్నాము. రోడ్డుకు అడ్డంగా ఉన్న గడ్డివామి తొలగించాలని సుబ్బు రామయ్య కోరగా బలహీనులమైన మమ్మల్ని దాడులకు పాల్పడే విధంగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. సంబంధిత వి.ఆర్.ఓ కి విన్నవించుకుంటే వీఆర్వో చోద్యం చూస్తున్నాడు. గత వారం రోజులుగా దారి లేక విద్యార్థులు, పాఠశాలకు వెళ్లలేక,మూగ జీవాలు మేతకి తీసుకు పోలేక దయనీయ స్థితిలో జీవనం కొనసాగిస్తున్నాం. వీఆర్వో పట్టించుకోకపోవడం బాధాకరంగా ఉందని వారు అధికారుల దగ్గర వాపోయారు. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి గిరిజనులకు న్యాయం చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళలపై దాడి చేసి గాయపరిచిన వారిపై కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-పలమనేరు: నియోజకవర్గం లోని బైరెడ్డిపల్లి మండలం పెద్ద చెల్లారగుంట గ్రామంలో మహిళలపై దాడి చేసి గాయపరిచిన నాగమ్మ,, ఉషారాణి, వెంకటప్పలపై కేసు నమోదు చేయాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ అనుబంధం మహిళా సంఘం నాయకురాలు సరస్వతి, చంద్రకళ డిమాండ్ చేశారు. అందులో భాగంగా బుధవారం పలమనేర్ పట్టణంలో గల జాతీయ మానవ హక్కుల సంస్థ కార్యాలయం నందు మహిళా నాయకురాలు రుక్మిణి అధ్యక్షతన జరిగిన సంఘటనపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులు డివి మునిరత్నం, సోము రాజు, ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో చెత్త విషయంపై ఇరువర్గాలకు గొడవ జరుగుతుంటే దాన్ని నివారించడానికి మధ్యవర్తిగా వెళ్లిన బిందు అనే అమ్మాయిని పై తెలిపిన ముగ్గురు విచక్షణారహితంగా దాడి చేసి గాయపరచడం బాధాకరమన్నారు. ఎవరికైనా గొడవలు జరిగినప్పుడు మధ్యవర్తులుగా వెళ్లే వ్యక్తులు శాంతిని కోరుకుంటారే గాని గొడవలు ప్రేరేపించారని విషయం దాడి చేసిన మూరులు తెలుసుకోవాలన్నారు. ఓ పక్క బిందు పై దాడి చేసి మరల గాయపడిన ఆమెపై, గొడవల్లో సంబంధం లేని వ్యక్తులపై కౌంటర్ ఫిర్యాదు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. పెద్ద చెల్లారగుంటలో ఇప్పటివరకు ఈ ఘర్షణకు ప్రధాన కారకురాలైన నాగమ్మ 14 సార్లు గ్రామస్తులపై పోలీస్ స్టేషన్లో తప్పుడు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసిందన్నారు. పార్థసారథి, మణి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం ఉన్న గ్రామంలో ఇలాంటి గొడవలు, తప్పుడు ఫిర్యాదులు చేసేవారిపై పోలీసులు చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బిందు విషయంలో పోలీసులు సమగ్రమైన విచారణ జరిపి కారకులైన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం సుబ్రహ్మణ్యం, ఆనంద్, మురళి, చిన్నా, ఆదినారాయణ, బిందుతో పాటు బాధితులు పాల్గొన్నారు.

దివంగత విద్యార్థి కుటుంబానికి రూ.22 వేల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పుత్తూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో బీకాం మొదటి సంవత్సరం చదువుతూ ఫిబ్రవరి 20వ తేదీ రాత్రి ప్రమాదవశాత్తు రైలు ప్రమాదంలో ఎం.బాలాజీ మరణించిన విషయం తెలిసిందే.ఎం బాలాజీ అనే ఈ విద్యార్థి యొక్క కుటుంబం పేదరికంలో ఉన్న కారణం చేత కళాశాల అధ్యాప కులు కొంతమేరకు విరాళాలను సేకరించారు. మంగళవారం బాలాజీ తండ్రి ఎం వీరయ్యను కళాశాలకు పిలిపించి 22 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య మాట్లాడు తూ విద్యార్థిని విద్యార్థులు నిర్లక్ష్యంగా మెలగడం వల్ల సమస్యలు తెచ్చుకొని తల్లిదండ్రులకు కడుపుకోతను మిగల్చరాదని అన్నారు..విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టి. నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్ వి వీరయ్య, డాక్టర్.ఏ.దేవకి, ఏ.నాగేశ్వరరావు, డాక్టర్ పి సుజన, డాక్టర్ కే శ్రీనివాసులు, డాక్టర్ పి. గాయత్రి, పి. గౌరీ, డాక్టర్ జై. కోటేశ్వరరావు, డాక్టర్ సి.వెంకట కృష్ణయ్య తదితర అధ్యాపకులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చు

-పెథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ శ్రీ

విశాలాంధ్ర-పూతలపట్టు: విత్తన శుద్ధితో వ్యవసాయదారులు అధిక దిగుబడులు సాధించవచ్చని తిరుపతి వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల ప్లాంట్ పెథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ శ్రీ అన్నారు. పూతలపట్టు మండలం తిమ్మిరెడ్డి పల్లెలో మొక్కలు తెగుళ్లు శాస్త్రీయ విధానం పంటలు దిగుబడులపై షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక ద్వారా షెడ్యూల్డ్ కులాల రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ పంటలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే దిగుబడులు సాధించవచ్చని విత్తనం ఎంపిక నుండి పంట కోత వరకు చేపట్టవలసిన పద్ధతులు, సమగ్ర ఎరువుల యాజమాన్యం, యాంత్రికీకరణ, నివారణ గురించి రైతులకు తెలియజేశారు. నాణ్యమైన అది కాదు దిగబడులను సాధించడానికి చేపట్టవలసిన విత్తన శుద్ధి మొక్కల సాంద్రత పూత సమయాల్లో జిప్సం వాడటం వల్ల కలిగే ఉపయోగాలు పంట చుట్టూ జొన్న మొక్కజొన్న పంటల వలన కలుగు ప్రయోజనాలు గురించి తెలియజేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు సేంద్రీయ సాగు విధానాలను రైతులకు తెలియజేశారు. ఏ పంటకు ఏ ఎరువులు వేయను సంబంధిత వ్యవసాయ అధికారుల సలహా తీసుకొని వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు, తీసుకోవలసిన చర్యల గురించి తెలియజేశారు. షెడ్యూల్డ్ కులాల 30 మంది రైతులకు మాస్కులు భౌజులు, కిట్లను అందజేశారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ అధికారి మధురవాణి సిబ్బంది నీలిమ ప్రభావతి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మోహన్ బాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని స్థానిక గడ్డం వారి పల్లి రోడ్డు నందు గల ఎస్టీ కుటుంబాలకు 35 కుటుంబాలకు మోహన్ బాబు జన్మదిన సందర్భంగా వీర అభిమాని తాతయ్య ఊహ తెలిసినప్పటి నుంచి ప్రతి ఏడాది మోహన్ బాబు పుట్టినరోజు వేడుకగా పేదలకు ఉచిత అన్నదానం రోగులకు పాలు పళ్ళు అదే తరహాలో ఈ ఏడాది ఎస్టీ కుటుంబాలకు బట్టలు మిఠాయిలు బిస్కెట్ ప్యాకెట్లు ప్రతి కుటుంబానికి తన సొంత ఖర్చులతో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు ప్రతి ఏడాది మోహన్ బాబు జన్మదిన వేడుకలు క్రమం తప్పక తాతయ్య ఇన్ని కష్టాలు ఉన్న జన్మదిన వేడుకలు మాత్రం అట్టహాసంగా చేస్తారు బోయకొండ దేవస్థానం నందు పనిచేస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కూడా సొంత నిధులతో చేయడం మండలంలోని ప్రజలు తాతయ్యను అభినందిస్తున్నారు.

23న తిరుపతిలో మాలల సింహగర్జన

విశాలాంధ్ర-చిత్తూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 23వ తేదీన తిరుపతిలో మున్సిపల్ మైదానం నందు జరగనున్న రాయలసీమ మాలల సింహ గర్జన కార్యక్రమంలో మాలలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరు ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాలల సింహగర్జనకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు దుగ్గాని జయరాం మాట్లాడుతూ దళితులు ఐక్యమత్యను చూసి తట్టుకోలేక మాల మాదిగలను విడగొట్టేందుకు పాలకులు చేసే ప్రయత్నమే ఎస్సీ వర్గీకరణ అని తెలిపారు. తిరుపతిలో జరగనున్న మాలల సింహగర్జన లో పాల్గొని పాలకులకు కనువిప్పు కలిగేవిధంగా మాలలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు ఈ మీడియా సమావేశంలో కవి రాఘవులు, లక్ష్మీనారాయణ, కాణిపాకం ధనలక్ష్మి, మునస్వామి దామోదరం మోక్షజ్ఞేశ్వర రావు, రాబర్ట్, పార్థసారథి, చంగల్ రాయుడు బుల్లెట్ బాబు, మురళి శరవణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లో ప్రతి మంగళవారం గ్రీవెన్స్ సెల్!

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని పోలీస్ స్టేషన్ నందు ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు పలమనేర్ డి.ఎస్.పి డి ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం జరుగుతుందని ఎస్సై లోకేష్ తెలిపారు ప్రజలు వారి వారి సమస్యల పట్ల ప్రతి మంగళవారం పోలీస్ స్టేషన్ వచ్చి సమస్యలను పరిష్కరించుకునే విధంగా గ్రీవెన్స్ సెల్ ను ఉపయోగించుకోవాలని కోరుతున్నామన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ముగ్గురికి సమాజ సేవ విధింపు

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణ పరిసరాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ముగ్గురు వ్యక్తులపై సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్లో చిన్న చిన్న కేసులు నమోదు చేయబడ్డాయి అని ఎస్సై బ్రహ్మానాయుడు తెలిపారు. వారిని సూళ్లూరుపేటలోని 2వ తరగతి ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి సుబ్బారావు, ప్రతి ఒక్కరికీ రూ. 200 జరిమానా విధించి, సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మానవతా దృక్పథంతో సమాజ సేవలో భాగంగా మూడు గంటలు పనిచేయాలని ఆదేశించారు. ఈ ముగ్గురి ద్వారా ఆసుపత్రిలో రోగులకు సేవ చేసే దానికోసం డాక్టర్ రమేష్ బాబు సిఎస్ ముందు వారిని హాజరుపరిచారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత న్యాయమూర్తులకు మొదటిసారిగా కొన్ని రకాల నేరాలకు పాల్పడిన వారికి ఇలా సమాజ సేవ చేసేలా చేసే అధికారాన్ని ఇచ్చింది అని సులూరుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

శ్రీ సాయి సుధా హాస్పిటల్లో ఉచిత బిఎండి పరీక్షలు

విశాలాంధ్ర-తిరుపతి: స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.0 వరకు ఉచిత బిఎండి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఎముకలు, కీళ్ల నరముల వైద్య నిపుణులు డాక్టర్ బి. సుకుమార్ ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ముంబయ వారిచే ఉచిత పరీక్షలు చేయడంతో పాటు సలహాలు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలని, ఎముకల సాంద్రత ఎంత తీసుకున్న క్యాల్షియం సరిపోతుంద లేదా అనేది తెలుసుకోవడం కోసం క్రమం తప్పకుండా ప్రతి 3 నెలలకు ఒకసారి ఎముకల వైద్యుల్ని కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. ఎక్సరే బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకొని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ చేసుకోవాలన్నారు. 40 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరిలో ఎముకల సాంద్రత తగ్గడంలో అనుకూలత, ఎముకలకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బా నాయుడు మాట్లాడుతూ ఎముకలలో కాల్షియం తగడం వల్ల వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేసారు.ఈ వైద్య శిబిరం నందు సుమారు 70 మందికి పైగా పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు తెలియజేశారు. డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుబ్బా నాయుడు, డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత, సురేంద్ర, సుజాత, విశ్వనాథ్, పార్వతి, శీను, హేమంత్, ప్రవీణ్, సోమశేఖర్, మహేష్, కమల్, దేవ, నరేంద్ర, సిస్టర్స్ జయకుమారి, సింధు మరియు ఇంటస్ ఫార్మా కంపెనీ ప్రతినిధి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కంకర మరియు మట్టివి రవాణా చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మట్టిని రవాణా చేసే వ్యక్తులు ఎవరైనా ఉంటే వారిపై కఠిన చర్యలుగైకొని కేసులు నమోదు చేస్తామని తాసిల్దార్ కె నాగరాజు హెచ్చరించారు ఈ మేరకు తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాసిల్దార్ మాట్లాడుతూ మండలంలో అక్రమంగా మట్టిని తరలించి చట్టానికి విరుద్ధంగా నడుచుకుం టు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని మండిపడ్డారు వీఆర్వోలు క్షేత్రస్థాయిలో మీకు సంబంధించిన రెవెన్యూ గ్రామాల్లో మట్టిని అక్రమంగా ఎక్కడ తరలిస్తున్నారు అన్ని విషయాలపై ప్రత్యేక దృష్టిసారించి అక్రమ రవాణా ని అరికట్టాలన్నారు మట్టి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను అడ్డగిస్తే తమపై తిరుగుబాటు చేస్తున్నారని వీఆర్వోలు తాసిల్దార్ గారి దృష్టికి తీసుకురాగా అందుకు ఎవరైనా మీపై తిరగబడితే వారి వివరాలు కార్యాలయంలో తనకు డిప్యూటీ తాసిల్దార్ గారికి తెలియజేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వీఆర్వోలకు తాసిల్దార్ తెలియజేశారు మీ గ్రామాల్లో అక్రమంగా మట్టి తరలింపు 1 భూ కబ్జాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు గైకొంటా మని వీఆర్వోలు అప్రమత్తంగా ఉండి విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు అలాగే రెవెన్యూ సదస్సులు రీ సర్వేలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉండాలని వీఆర్వోలకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ తాసిల్దార్ ఎం త్యాగరాజు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెచ్చిపోతున్న ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియాను అరికట్టాలి

గాలి చంద్ర సిపిఐ జిల్లా కార్యదర్శి ఆరోపణ

విశాలాంధ్ర-కడప రూరల్: గత వైసిపి ప్రభుత్వంలో ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియా విచ్చలవిడి దోపిడి ప్రజల మాన ప్రాణాలకు రక్షణ కొరవడి అభద్రతాభావంతో ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడి వైసీపీని ఘోరంగా ఓడించి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలో కూర్చోబెడితే ప్రభుత్వం మాటున మాఫియా రెచ్చిపోయి అక్రమాలకు పాల్పడుతోందన్నారు. వైసిపి టిడిపి దొందూ దొందే అన్న చందంగా దోపిడీ సాగిస్తున్నారని బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సమూలంగా మార్పులు చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అందుకు భిన్నంగా నడుస్తోందన్నారు. విలువైన ప్రభుత్వ వంకా, వాగు, చెరువు, రాస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈ నామ్, వక్ఫ్, అటవీ, స్మశాన భూముల ఆక్రమణ యదేచ్ఛగా సాగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైతే ఆక్రమణలకు పాల్పడ్డారో ప్రస్తుత కూటమి నేతల బంధువులుగానో, బాగ స్వాముల గాను మారి యదేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఎక్కడపడితే అక్కడ అనుమతులు లేని మట్టి క్వారీలు ఏర్పాటు చేసుకొని యదేచ్ఛగా తవ్వకాలు చేపట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. మండిపోతున్న ఎండల ప్రభావం భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయి బోర్లు ఫిల్టర్లు ఎండిపోయి పంట కొచ్చిన చేను ఎండిపోయి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయే ప్రమాదం, త్రాగునీటి ఇక్కట్లు మొదలయ్యే సమయాన స్థానిక ప్రజల రైతులు అభ్యంతరాలను లెక్కచేయకుండా పోలీసులను అడ్డుపెట్టుకొని నేషనల్ ఎక్స్‌ప్రెస్ హైవే, అవుట్ల పేరుతో ల్యాండ్, శాండ్, మైనింగ్ మాఫియా అక్రమాలకు కళ్లెం వేయాలన్నారు.మద్యం షాపుల టెండర్లలో ఎవరికి వచ్చినా ప్రభుత్వానికి చెల్లించే పైకంతోపాటు ఎమ్మెల్యేల వాటా చెల్లించాలని, చెల్లించని యెడల షాపులు స్వాధీనం చేసి వదిలి వెళ్ళిపోవాలని ఆ విధంగా చేయని వారిపై అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరింపులతోపాటు ప్రభుత్వానికి చెల్లించే పన్ను ఆదాయానికి మించి చెల్లించాల్సి వస్తుందన్న కారణంతో బెల్టు షాపులకు ద్వారాలు తెరుస్తున్నారని 24 గంటలు మద్యం అందుబాటులోకి అతి సమీపంలోకి చేరవేసి ప్రజల మానప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియా విషయంలో వైసిపి, టిడిపి దుందు దొందే అన్న చందంగా నడుస్తోందని వైఖరి మార్చుకోకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని వారు హెచ్చరించారు.సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగ సుబ్బారెడ్డి, ఎన్.వెంకట శివ, ఎంవి సుబ్బారెడ్డి, జి. వేణుగోపాల్, కే.సిబాదుల్లా, సుబ్రమణ్యం, సురేష్ పాల్గొన్నారు.

నేడే పశువుల సంత బహిరంగ వేలం

విశాలాంధ్ర-రామాపురం: మండల కేంద్రంలో వారాంతపు శనివారం నిర్వహించే పశువుల సంత 2025-2026 ఆర్థిక సంవత్సరంలో పశువుల సంత తో పాటు బస్టాండ్ గేటు వేలం గురువారం సాయంత్రం 3 గంటలకు సంత నిర్వహించే ప్రదేశంలో బహిరంగ వేలం నల్లగుట్టపల్లి సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు ప్రకటనలలో తెలిపారు. పాటలో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతీకి ఎలాంటి బాకీ ఉండరాదు పశువుల సంత పాటలో పాల్గొనే వారు 2.50 లక్షల. బస్టాండ్ గేటు వేలంలో పాల్గొనేవారు 50 వేలు సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకురావాలి. పశువుల సంత వేలం పాటదారుడు 50వేలు. బస్టాండు గేటు వేలం పాట దారుడు 30వేలు ధారావతు చెల్లించి పాటలో పాల్గొనవలెను పాట నిలిపిన వెంటనే పాడిన మొత్తం అక్కడే చెల్లించవలెను అటు చెల్లించని యెడల ధారావతు వెనక్కి ఇవ్వడదు వేలంతో ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా రద్దు చేసుకునే అధికారం గ్రామపంచాయతీకి కలదు పాటదారుడు స్టాంపు డ్యూటీ చట్టం ప్రకారం 5 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించి అగ్రిమెంటు చేసుకోవాలని తెలిపారు.

పర్యవేక్షణలో పవర్ ఫుల్

ప్రజలతో మమేకం.. శాంతిభద్రతల్లో భేష్

టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు పనితీరు ఇదీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆయనో ఫ్రెండ్లీ పోలీస్. హోదా మరచి సాధారణ పోలీసుగా ప్రజలతో మమేకమైపోతారు. అందరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతల పర్యవేక్షణలో పవర్ ఫుల్ అధికారిగా అందరి చేత శభాష్ అనిపించు కుంటున్నారు. ఆయనెవరో కాదు శ్రీకాళహస్తి పట్టణ రెండో పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు. ఇక్కడ బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే అందరి మన్ననలు పొందుతూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఉన్నతాధికారులకు ఆయనంటే ఒక నమ్మకం. ఏ బాధ్యత అప్పగించినా అంకిత భావంతో పని చేయడం ఆ పనిలో పురోగతి సాధించడం ద్వారా పలు పురస్కారాలు అందుకున్నారు. పట్టణ రెండో పోలీసు స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయి. ఈ స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి కూడా సమస్యాత్మక ప్రాంతాలతోనే ఇక్కడి అధికారులకు పెద్దతలనొప్పిగా ఉండేది. అయితే వెంకటేశ్వర్లు సీఐగా బాధ్యతలు చేపట్టి ఆ ప్రాంతాలపై అనతి కాలంలోనే పట్టు సాధించారు. ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే స్పందించడం ద్వారా ఆ ప్రాంతాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణలో పవర్ ఫుల్ అధికారిగా పేరుతెచ్చుకున్నారు. తద్వారా చాలా వరకు ఆ ప్రాంతాల్లో నేరాలను అదుపులోకి తీసుకురావడం లో సఫలీకృతులయ్యారు. అంతేకాదు శ్రీకాళహస్తిలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఏడు గంగమ్మల జాత, నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన శివరాత్రి, రథోత్సవం, కళ్యాణోత్సవం వంటి రోజుల్లో పోలీసుల బందోబస్తు ఎప్పుడూ లేని విధంగా ప్రజల నుంచి ప్రశంసలందుకుంది. ఈ బందోబస్తు చర్యలు తిరుపతి ఎస్పీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి డీఎస్పీ సూచనలతో సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా బృందంగా విధులు నిర్వహించారు. అయితే ఒక సైన్యమై వెంకటేశ్వర్లు నిర్వహించిన విధులు.. పర్యవేక్షణ ప్రత్యేకతను చాటుకుంది. ప్రధానంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవంలో తనకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించారు. తనదైన శైలిలో మళ్లీ ఉన్నతాధికారుల నుంచి అభినందనలు ప్రశంసలు అందుకున్నారు. మొత్తంగా తన సమర్థవంతమైన విధులతో ఇప్పటివరకు ఉన్నతాధికారుల నుంచి 18కి పైగా రివార్డులను అందుకున్నారు. అంతేకాదు స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ పురస్కారాలను పలుసార్లు స్వీకరించారు. ఇలా ఫ్రెండ్లీ పోలీసుకు అర్థం చెబుతూ అందరితో మమేకమై శాంతిభద్రతల పర్యవేక్షణలో టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు మేటిగా నిలుస్తూ ప్రజల నుంచే కాదు ఉన్నతాధికారుల నుంచి కూడా శభాష్ అనిపించుకుంటున్నారు. ఇటువంటి అధికారికి చేద్దాం సెల్యూట్ అనేలా ఉంది ఆయన పనితీరని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

విశాలాంధ్ర-మదనపల్లె: భార్య హత్య కేసులో భర్త కుమార్(24)ను అరెస్ట్ చేసినట్లు మదనపల్లి డిఎస్పి కొండయ్య నాయుడు తెలిపారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం, బెలగాం జిల్లా, బాటకుర్తి తండాకు చెందిన సంగీత(25), అదే తండాకు చెందిన కుమార్ ఇద్దరూ ఒకే ఊరిలో ఉంటూ డిగ్రీ వరకు చదువుకున్నారు. ఈ క్రమంలో పెద్దలకు తెలియకుండా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించలేదని ఇద్దరు లేచిపోయి ఏడాదిన్నర క్రితం గుర్రంకొండ మండలంలోని మర్రిపాడుకు వచ్చి ఓ రైస్ మిల్లులో కూలి పనులు చేసుకుంటూ స్థిరపడ్డారు. ఈ క్రమంలో కుమార్ మద్యానికి బానిసై తరచూ కొట్టి పిల్లల పుట్టలేదని వేధించేవాడు. దీంతో గత నెల 28 శివరాత్రి సంగీతను కుమార్ పథకం ప్రకారం హత్య చేశాడు. ఆపై తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులను నమ్మించి మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేట్ అంబులెన్స్ లలో బెలగాంలోని బాటకుర్తి తండాకు తీసుకెళ్లాడు. అక్కడ సంగీత మృతదేహాన్ని కాల్చివేసి మిన్న కూడిపోయాడు. మర్రిపాడు గ్రామస్తుల సాయంతో హత్య జరిగినట్లు నిర్ధారించిన గుర్రంకొండ ఎస్సై మధు రామ చంద్రుడు, వాల్మీకిపురం సిఐ ప్రసాద్ బాబు హత్య కేసును లోతుగా దర్యాప్తు చేపట్టి నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించదంతో అరెస్టు చేసినట్లు డిఎస్పి తెలిపారు.

సునీత విలియమ్స్‌కి రితేష్ రెడ్డి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బద్వేలు : భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యోమగామి సునీతా విలియమ్స్ అద్భుతమైన అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేసి భూమి పైకి తిరిగివచ్చిన సందర్భంగా టిడిపి బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్ కు వెళ్లారని 8 రోజుల్లో పూర్తవాల్సిన ఈ అంతరిక్ష ప్రయాణం స్టార్‌లైనర్ లో సాంకేతిక సమస్యల కారణంగా 9 నెలల పాటు పొడగించబడింది, అయినప్పటికీ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి అంతరిక్షంలో ఎక్కువ రోజులు గడిపిన మహిళా వ్యోమగామిగా సునీతా విలియమ్స్ కొత్త రికార్డు నెలకొల్పారని, ఆమె పేరు అంతరిక్ష పరిశోధనా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఆమె మరిన్ని ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, సునీతా విలియమ్స్ వంటి మహనీయులు దేశ యువతకు ముఖ్యంగా మహిళలకు ప్రేరణగా నిలుస్తారని రితేష్ రెడ్డి అన్నారు.

మంత్రి పుట్టినరోజు సందర్భంగా ప్రేమాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-రామాపురం : రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు డాక్టర్ లక్ష్మీప్రసాద్రెడ్డిల జన్మదినం సందర్భంగా బుధవారం రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని రామాపురం మండలం పంచాయతీ కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం చెందిన ఏనుగుల సుధాకర్. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పండ్లు. బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, నేను కూడా ఏనుగుల సుధాకర్. కొరివి ధనంజయ. బండారు తిమ్మారెడ్డి. ఈశ్వరయ్య. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేయక ముందే మాలల పట్ల కులవివక్ష ప్రదర్శిస్తున్న పీలేరు తహసీల్దార్

విశాలాంధ్ర-పీలేరు: ఎస్సీ వర్గీకరణ జరగకముందే మాలల పట్ల పీలేరు మండల ఎమ్మార్వో యం.భీమేశ్వర్ రావ్ కులవివక్ష ప్రదర్శిస్తున్నారని నేడు మాలమహానాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఆగ్రహించారు. ఈ నెల 3వ తేదిన పీలేరు పట్టణానికి చెందిన మాల సామాజికవర్గానికి చెందిన ఓ వ్యక్తి తాను నివసిస్తున్న ఇంటికి అనుభవ స్థితిపత్రం కొరకు అర్జీ సమర్పించారు అర్జీ ఇచ్చిన రోజు నుండి అర్జీదారులు ఇబ్రహీం,సుధాకర్, రెడ్డి శేఖర్, కళ్యాణి, వీఆర్వోల చుట్టూ మరియు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఈరోజు రేపు అంటూ వీఆర్వోలు కాలయాపన చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 11 న చరవాణిలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన అర్జీదారులు ఇంటిని సందర్శించి ఎమ్మార్వో కు నివేదిక సమర్పించారు అర్జీ దారునితో కలిసి మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఎమ్మార్వోను కలసి అర్జీదారుని అనుభవ స్థితిపత్రం స్థితిగతుల గురించి వివరణ కోరగా ఎమ్మార్వో ఓ బాధ్యతయుత ప్రభుత్వ అధికారిగా స్పందించకుండా ఓ రాజకీయ నేతగా దర్పం ప్రదర్శిస్తూ కార్యాలయం తన జాగీరు లాగా వ్యవహరిస్తూ అర్జీ దారిని పట్ల మాలమహానాడు నాయకుల పట్ల బాధ్యతరాహిత్యంగా, దూకుడుగా వ్యవహరిస్తూ మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు వెళ్ళండి వెళ్ళండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తూ ఒక మాల సామాజిక వర్గానికి చెందిన నాయకుని పట్ల అర్జీదారుల పట్ల కనీస గౌరవ మర్యాదలు లేకుండా తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ ఎదుటివారి ఆత్మ అభిమానం కించపరిచేలా వ్యవహరిస్తున్న తహసీల్దార్ తీరు విచారించదగ్గ విషయమని నాయకుల పరిస్థితి ఇలా ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఇంకెలా ఉంటుందని ఆవేదన చెందారు మునుముందు ఎమ్మార్వో వ్యవహార శైలి ఇలాగే కొనసాగితే మాలమహానాడు ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో మామహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున,మండల కార్యవర్గ సభ్యులు కొప్పల వినయ్ కుమార్, వై కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడులను నివారించాలి

ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి యస్. నాగరాజు డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: బంగారుపాలెం మండలం, బోడబండ్ల గ్రామంలో ఏనుగుల గుంపు రైతులు పండించిన పంటలను తొక్కి నాశనం చేసిన పంటలను సిపిఐ నాయకత్వం జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు కే.మణి, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర,జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.కుమారి, పి.రఘులు సందర్శించిన అనంతరం బోడబండ్ల గ్రామ సచివాలయం కార్యాలయం ముందు ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులతో సిపిఐ నాయకులు నిరసన తెలిపారు ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ బోడబండ్ల గ్రామంలో గత మూడు నెలలుగా రాత్రి వేళలో ఏనుగులు గుంపు పంటలపై పడి నాశనం చేస్తున్న అధికారులు సోద్యం చూస్తున్నారని ఆ వేదన వ్యక్తం చేశారు.రైతులు అధికారులకు చెబుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని రైతులు పండించిన పంటలను ప్రజల ప్రాణాలను కాపాడాలని, ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అన్న ప్రసాద కేంద్రంలో అదనపు ఈవో తనిఖీలు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్చి 20, 21వ తేదీలలో తిరుమల పర్యటన నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి బుధవారం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా టీటీడీ విజిలెన్స్, ఇంజినీరింగ్, గార్డెన్, అన్న ప్రసాదం అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనకు చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అనంతరం అన్న ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అన్న ప్రసాదం చాలా రుచికరంగా ఉందని అదనపు ఈవో వద్ద సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాజేంద్ర, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఈఈ వేణు గోపాల్, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ టి.డి.ఆర్. బాండ్లు

కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర-తిరుపతి: అర్హులైన ప్రతి ఒక్కరికీ టి.డి.ఆర్. బాండ్లు ఇచ్చేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని, త్వరలోనే ఇవ్వనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.డి.ఆర్. బాండ్లు అర్హులైన వారికి అందించాలనే సదుద్దేశ్యంతో కార్యాలయంలో డి.సి, డి.సి.పి. ఆధ్వర్యంలో రెండు నెలలు గా ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించి దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రతి వారం టి.డి.ఆర్. కమిటీ ప్రత్యక్షం గానూ, ఆన్లైన్ ద్వారా సమావేశమై చర్చిస్తున్నామని తెలిపారు. కాగా ఎక్కువ మంది నివాసయోగ్యమైన స్థలాలను, వ్యాపార యోగ్యంగా చూపడంతో టి.డి.ఆర్. బాండ్లు పంపిణీకి ఆలస్యం అవుతున్నదని తెలిపారు. ఆయా వార్డుల పరిధిలో ప్లానింగ్ సెక్రటరీ లు కూడా ఇండ్ల వద్దకే వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని, ప్రజలు కూడా తమ పత్రాలను ఇచ్చి సహకరించాలని తెలిపారు. మొదటి విడత కమిటీ సమావేశం కి 9 దరఖాస్తులు రాగా అందులో అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న ఒక వ్యక్తికి బాండ్ ఇచ్చామని తెలిపారు. రెండవ విడత సమావేశంలో 30 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలన పూర్తి చేసి, త్వరలో లబ్ధిదారులకు అందజేయనున్నామని తెలిపారు. టి.డి.ఆర్. బాండ్లు పంపిణీ లో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని, ఇందులో ఎటువంటి అపోహలను నమ్మవద్దని కమిషనర్ ఎన్.మౌర్య ఆ ప్రకటనలో తెలిపారు.

వేలంపాట ద్వారా పంచాయతీకి రూ.11 లక్షల 36,700 ఆదాయం

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి గ్రామపంచాయతీ కి వేలం ద్వారా ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ వరుణ్ భరత్ తెలిపారు వారపు కూరగాయల సంత గిరిబాబు తొమ్మిది లక్షల 53 వేల రూపాయలకు హెచ్చుగా పాడి హక్కును దక్కించుకున్నారు ప్రవేట్ బస్టాండు ఒక లక్ష 81,000 వేలంలో హెచ్చుగా పాడి హక్కును దక్కించుకున్నారు కార్యాలయం ఎదుట గల కొబ్బరి చెట్లను 2700కు భాస్కర హక్కు దక్కించుకున్నాడు 2025 26 సంవత్సరాల కాను పై ఆదాయం వచ్చినట్లు మండల విస్తరణ అధికారి కృష్ణవేణి పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ తెలిపారు కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఆవుల రామచంద్ర కార్యకర్తలు వేలంపాటిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ఒకటవ పట్టణ సీఐ గోపి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం తన సిబ్బందితో కలిసి శ్రీకాళహస్తి పట్టణ శివారులో గల నీలకంఠేశ్వరస్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. గతంలో అక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఎవరో తొలగించడంతో దానిని మళ్లీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ గోపి మాట్లాడుతూ... బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. ముఖ్యంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో భక్తుల మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు సంపూర్ణంగా ప్రజలకు అందించడమే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ గవర్నెన్స్ సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తేవడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి లక్ష్యమని మాజీ ఎంఎల్సీ గౌనివారి శ్రీనివాసులు మరియు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి లు అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాట్సప్ ద్వారా టెక్నాలజీని అందిపుచ్చుకుని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు వాట్సాప్ ద్వారా 161 సేవలను ప్రజలకు అందుబాటులోకి రానుంద ఈ సందర్భంగా రెవిన్యూ, విద్యుత్ బిల్లులు, బస్ టికెట్లు, ఎన్టీఆర్ వైద్య సేవలు, దేవాలయ దర్శన టికెట్లు, వివాహ ధ్రువపత్రాలు తదితర సేవలను త్వరలోనే 300 మన మిత్ర వాట్సాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల పాలనలో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించడం జరిగిందని పేర్కొన్నారు కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ మాజీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, సీతాపతి, చిన్నికృష్ణ, చలపతి పాల్గొన్నారు.

పట్టణంలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఎన్.వి రమణారెడ్డి

విశాలాంధ్ర-పలమనేరు: రాబోవు వేసవి కాలములో పట్టణంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటున్నందువలన నీటి సరఫరాకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్వి రమణారెడ్డి తెలిపారు. అందులో భాగంగా బుధవారం నీటి వనరులు ఉన్న నాగమంగళం పంపు హౌస్ ను మునిసిపల్ కమిషనర్ ఎన్వి రమణా రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.సురేష్ బాబు సందర్శించారు. సంప్ హౌస్ నందు నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున చెడిపోయిన బోర్లను రిపేరు చేయుటకు మరియు క్రొత్త బోర్లు వేయుటకు ప్రతిపాదనలను సిద్ధము చేయవలసినదిగా కమిషనర్ సంబధిత అధికారులకు ఆదేశించారు. పట్టణ ప్రధాన మంచి నీటి వనరు అయిన కౌండిన్య రిజర్వాయరును సందర్శించి నీటి నిల్వలు పరిశీలించడము జరిగినది. అందుపై స్థానిక ప్రజలు కౌండిన్య రిజర్వాయరు నందు ఇసుక త్రవ్వకాలు జరుగు చున్నదని పరిశీలించి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకొని సదరు విషయము పలమనేరు పట్టణ ఎంఆర్ఓకు సమాచారము అందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్వీయూలో సాఫ్ట్ స్కిల్స్ సదస్సు

విశాలాంధ్ర-తిరుపతి: ఎస్వీయు కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సాఫ్ట్ స్కిల్స్ పై ఎంసీఏ,ఎంబీఏ చెందిన 400మంది విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్సిటీ కామర్స్ కళాశాల అధ్యక్షులు ఆచార్య పి వి నరసయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు, సమాచార నియంత్రణ, సమస్య పరిష్కారాలు, భావోద్వేగ నైపుణ్యం, సామూహిక కార్యక్రమాలు వంటి సాఫ్ట్ స్కిల్స్ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి ఆచార్య అంజన్న బాబు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్య మురళీధర్, కోఆర్డినేటర్స్ డా పత్తిపాటి వివేక్, డా.కళ్యాణ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూ విద్యార్థికి గేట్ పరీక్షల్లో జాతీయస్థాయి 78వ ర్యాంకు

విశాలాంధ్ర-తిరుపతి: జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) లో ఎస్వి యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ పీజీ విద్యార్థిని బి.కీర్తి 78వ ర్యాంకు సాధించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కీర్తి వర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగంలో ఎమ్మెస్సీ పీజీ కోర్సు పూర్తి చేశారు.గేట్ పరీక్షల్లో ర్యాంకు పొందడం ద్వారా జాతీయ స్థాయి విద్య సంస్థలలో పరిశోధనలు చేయడానికి నేరుగా అవకాశం లభించింది. ఈ సందర్భంగా గేట్ లో జాతీయస్థాయి 78వ ర్యాంకు సాధించిన విద్యార్థి కీర్తిని వర్సిటీ సైన్స్ కళాశాల అధ్యక్షురాలు ఆచార్య పద్మావతి, ఉపాధ్యక్షులు ఆచార్య ఒ వి ఎస్ రెడ్డి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య దేవప్రసాద రాజు తదితరులు అభినందనలు తెలియజేశారు.